సాక్షి ఒడిశా

శనివారం । 14 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,03,996లు, బంగారం 10.1 గ్రాములు, వెండి 41.7 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



ముగిసిన క్రీడోత్సవం

-IIలో



తెలంగాణ సీఎంతో గిరిధర్ గొమాంగొ భేటీ

-IIలో

న్యూస్‌రీల్

ఒడిశా క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహం



అమిత్ రోహిదాస్

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ ఒడిశా హాకీ పురుషుల ప్రపంచకప్-2023లో పాల్గొనే ఒడిశాకు చెందిన భారత్ జట్టు హాకీ క్రీడాకారులకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శుక్రవారం ప్రత్యేక నగదు పురస్కారం ప్రకటించారు. వీరిలో అమిత్ రోహిదాస్, నీలం సంజీప్ ఎక్సెస్ ఉన్నారు. ఇరువురికీ చెరో రూ.10 లక్షల నగదు ప్రోత్సాహకం ప్రకటించడం విశేషం. మ్యాచ్ ప్రారంభం రోజున జరిగే భారత్, స్పెయిన్ పోటీలో ఇరువురూ పాల్గొన్నారు. రోహిదాస్ టోక్యో ఒలింపిక్ కాంస్య పతక విజేత జట్టులో సభ్యుడు. పెనాల్టీ కార్నర్ సమయంలో డిఫెండర్‌గా ఎల్లప్పుడూ ప్రత్యామ్నాయ సాధనంగా ఉపయోగ పడతాడు. ఇప్పటి వరకు 18 అంతర్జాతీయ గోల్స్ చేశాడు. అలాగే నీలం సంజీప్ ఖాతాలో 5 అంతర్జాతీయ గోల్ ఉన్నాయి. ప్రపంచకప్ వేదిక రౌర్కెలా బిర్సాముండా స్టేడియానికి సమీపంలోని కడోబహల్ గ్రామస్తుడు కావడంతో సొంత గెడ్డపై తన ఉనికిని చాటుకునేందుకు అత్యద్భుత అవకాశంగా ఈ పోరును భావిస్తున్నాడు.

కొరియాలో భూ పట్టాలు పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పీతం పాఢి

కొరాపుట్: ఆంధ్రా-ఒడిశా వివాదాస్పద ప్రాంతం కొరియాలో పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢి గిరిజనులకు భూ పట్టాలు పంపిణీ చేశారు. జిల్లాలోని పొట్టంగి సమితి కొరియా పంచాయతీ నేరడివలసలో శుక్రవారం జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేయగా, 120మంది పేదలకు దుప్పట్లు వితరణగా అందజేశారు. ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించి, 200 రోగులకు మందులు అందించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సభ్యురాలు టిక్లై గెమల్, పొట్టంగి సమితి అధికారులు పాల్గొన్నారు.

నాగుపాము కలకలం



సర్పాన్ని బంధిస్తున్న స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యుడు సుధామ్

బరంపురం: స్థానిక సబ్ కలెక్టర్ నివాసంలో నాగుపాము కలకలం సృష్టించింది. విషయం తెలుసుకున్న బరంపురం అటవీశాఖ అధికారులు.. స్నేక్ హెల్ప్‌లైన్ సంస్థకు సమాచారం అందించారు. సిబ్బంది సుధామ్‌కుమార్ సాహు చాకచక్యంగా 7 అడుగుల నాగుపామును బంధించారు. అనంతరం లకాడి అటవీ ప్రాంతంలో సర్పాన్ని సురక్షితంగా విడిచి పెట్టారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

సేవలు విస్తరించేందుకు చర్యలు



రొండాపల్లి ఉన్నత పాఠశాలలో ప్రసంగిస్తున్న యజ్ఞేశ్వర పండా

జయపురం: సమాజ సేవలో గురుతర భూమిక నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ కార్యక్రమాలను అన్ని ఉన్నత పాఠశాలలకు విస్తరింప జేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని కొరాపుట్ జిల్లా జూనియర్ రెడ్‌క్రాస్ సొసైటీ అధికారి యజ్ఞేశ్వర పండా వెల్లడించారు. జిల్లా విద్యాధికారి రామచంద్ర నాయక్ ఆదేశాల మేరకు వివిధ పాఠశాలల్లో రెడ్‌క్రాస్ కార్యక్రమాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రొండాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఎకంబా, దొరాగుడ, బలిపూజారిపుట్, పూజారిపుట్ ఉన్నత పాఠశాలల్లో శిబిరాలు నిర్వహించి, జూనియర్ రెడ్‌క్రాస్ యూనిట్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ రెడ్‌క్రాస్ సమితి కో-ఆర్డినేటర్ గోరాచంద్ త్రిపాఠి, ప్రధానోపాధ్యాయులు గంగాధర షొడంగి, డాక్టర్ జ్యోత్స్న మిశ్రా, మధుస్మిత దుంభి, అంజనకుమార్ మాఝి, పరశురాం గోండ్ పాల్గొన్నారు.

జయం మనదేరా..

హాకీ ప్రపంచకప్-2023 పురస్కరించుకుని రౌర్కెలా పట్టణం కళకళలాడింది. నూతనంగా నిర్మించిన అతిపెద్ద బిర్సాముండా హాకీ స్టేడియంలో ప్రేక్షకులతో కిక్కిరిసింది. భారత్ జట్టు స్పెయిన్ జట్టుతో తలపడుతున్న మ్యాచ్‌ను ప్రత్యక్షంగా తిలకించేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలి వచ్చారు. అలాగే పట్టణంలో ఇటీవల ప్రారంభించిన హాకీ విలేజ్ సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారత్ జట్టు గెలుపు ఆకాంక్షతో ఆబాల గోపాలం అత్యంత ఉత్సాహం ప్రదర్శించారు. పలువురు అభిమానులు ముఖాన మువ్వన్నెల తిలకం, చేతిలో జాతీయ పతాకంతో బిర్సాముండా స్టేడియానికి కొత్త కళను రంగరించారు.

- భువనేశ్వర్



మైదానంలోకి అడుగు పెడుతున్న భారత్-స్పెయిన్ జట్ల క్రీడాకారులు

- అట్టహాసంగా ప్రారంభమైన హాకీ ప్రపంచకప్-2023
- తన తొలి మ్యాచ్‌లో 2-0 తేడాతో స్పెయిన్‌పై నెగ్గిన భారత జట్టు
- మ్యాచ్‌కు ప్రత్యక్షంగా హాజరైన ఒడిశా, సిక్కిం సీఎంలు
- ప్రేక్షకులతో కిక్కిరిసిన రౌర్కెలా, కళింగ స్టేడియాలు



100 బస్తాల ధాన్యం గింజలతో సుదర్శన పట్నాయక్ రూపొందించిన హాకీ ప్రపంచకప్ నమూనా

1 తొలి విజయం అర్జెంటీనాదే..

ప్రపంచకప్ ప్రారంభ మ్యాచ్ ముగిసింది. భువనేశ్వర్ కళింగ స్టేడియంలో శుక్రవారం జరిగిన పూల్-ఏ తొలి మ్యాచ్‌లో అర్జెంటీనా, దక్షిణాఫ్రికా జట్లు తలపడ్డాయి. ఇందులో అర్జెంటీనా 1-0 స్కోరుతో విజయం సాధించింది. ఇరుజట్ల మధ్య హోరాహోరీగా సాగిన పోరు ఆద్యంతం ఉత్కంఠంగా జరిగింది. ఆట ప్రారంభమైన దాదాపు 45 వరకు ఉభయ జట్లు స్కోరు చేయక పోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. 42వ నిమిషంలో మెయికో కసెలా కీలకమైన గోల్ చేయడంతో అర్జెంటీనా జట్టు విజయానికి దోహదపడింది.



హోరాహోరీగా తలపడుతున్న అర్జెంటీనా, దక్షిణాఫ్రికా జట్లు



సిక్కిం సీఎం ప్రేమ్‌సింఘ్‌కు జ్ఞాపికలను అందిస్తున్న సీఎం నవీన్

రౌర్కెలా బిర్సాముండా స్టేడియంలో జరిగిన భారత్ జట్టు తొలి మ్యాచ్‌ను రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రత్యక్షంగా హాజరై తిలకించారు. ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్, సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్‌సింఘ్ తమాంగ్(గోలే) భారత్-స్పెయిన్ జట్టు మ్యాచ్ ఆద్యంతాలు అత్యంత ఉత్సాహంతో తిలకించారు. విజేత జట్టును వీరివురూ అభినందించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సింఘ్‌కు హాకీ ప్రపంచకప్ ట్రోఫీ చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు.



బిర్సాముండా స్టేడియంలో భారత్ విజయ పతాకం రెపరెపలు

2 చెలరేగిన ఆస్ట్రేలియా ఆటగాళ్లు..

రెండో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా అద్భుత ప్రదర్శన చేసి, ఫ్రాన్స్‌పై గెలిచింది. కళింగ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 8 గోల్స్ తేడాతో ఘన విజయం నమోదు చేసింది. ప్రపంచకప్ చరిత్రలో 3సార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఆస్ట్రేలియా.. తాజాగా ఫ్రాన్స్‌పై ఏకపక్ష విజయం సాధించడం విశేషం. కంగారూ ఆటగాళ్లు ఆరంభం నుంచి దూకుడు ప్రదర్శించారు. తొలి అర్ధభాగంలో ఒక్క గోల్ కూడా నమోదు చేయని, ఆసిస్ ఆటగాళ్లు.. రెండో అర్ధభాగంలో ఆకాశమే హద్దుగా చెలరేగింది. క్రెయిగ్ టామ్, హోవార్డ్ జెరెమీ చెరో 3 గోల్స్ చేశారు. టామ్ 8, 31, 44 నిమిషాల్లో, జెరెమీ 26, 28, 38 నిమిషాల్లో గోల్స్ నమోదు చేశారు. అదే



కళింగ స్టేడియంలో ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ జట్ల అద్భుత ప్రదర్శన



బిర్సాముండా స్టేడియం ఆవరణలో బారులుతీరిన ప్రేక్షకులు



మ్యాచ్ తిలకించేందుకు భారత్ జెర్సీ ధరించి, కుటుంబ సమేతంగా చేరుకుంటున్న అభిమానులు



ప్రజలకు అభివాదం చేస్తూ స్టేడియంలోకి అడుగు పెడుతున్న సీఎం నవీన్ పట్నాయక్

చక్ దే ఇండియా

భువనేశ్వర్: సువర్ణపూర్ జిల్లా సదరు మహకుమా ఇండోర్ స్టేడియంలో పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ వరి కంకులతో భారీ హాకీ ప్రపంచకప్ ఆకృతిని సృష్టించాడు. చక్ దే ఇండియా నినాదంతో భారత్ హాకీ జట్టు విజయాన్ని కాంక్షిస్తూ దీనిని తీర్చిదిద్దడం విశేషం. వరితో హాకీ ప్రపంచకప్ ఇలా తీర్చిదిద్దడం ప్రపంచంలోనే తొలిసారిగా ఆయన పేర్కొన్నాడు. దీనికోసం 100 బస్తాల ధాన్యం వినియోగించినట్లు తెలిపారు. 4,682 చదరపు మీటర్ల విస్తీర్ణంలో సుదర్శన్ పట్నాయక్, అతని శిష్య బృందం ఈ కళాఖండాన్ని ఆవిష్కరించారు. దీనిని ప్రపంచ రికార్డులో చేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. సువర్ణపూర్ జిల్లా మేజిస్ట్రేట్ అబోలి సునీల్ నర్వానే, బీర్ మహారాజ్‌పూర్ ఎమ్మెల్యే పద్మనాభ్ బెహెరా ఈ శిల్ప ప్రదర్శన ప్రారంభించారు. సువర్ణపూర్ జిల్లా ఒడిశా వరి పాత్రగా(రైస్ బౌల్) పేరొందింది. ఈ ప్రాంతం ప్రత్యేకతను సుదర్శన్ ఆవిష్కరించిన శిల్పం ప్రతిబింబిస్తుందని ఈ ఇరువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కళాఖండం యావత్ ప్రపంచానికి సువర్ణపూర్ ప్రత్యేకత సందేశం ప్రసారం చేస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

3 వేల్స్‌పై ఇంగ్లాండ్.

హాకీ ప్రపంచప్ పోటీల్లో భాగంగా నూతన స్టేడియం రౌర్కెలా బిర్సాముండా మైదానంలో జరిగిన తొలి అంతర్జాతీయ మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు విజేతగా నిలిచి, చరిత్ర సృష్టించింది. టోర్నమెంట్ మూడో మ్యాచ్‌లో 5-0 స్కోరుతో వేల్స్ జట్టును ఓడించింది. బ్రిటిష్ ఆటగాళ్లు ఆరంభం నుంచి పోరాట పటిమతో దూసుకు పోయారు. నికోలస్ పార్క్ మ్యాచ్ ప్రారంభమైన నిమిషం లోపే ఫీల్డ్ గోల్‌తో అద్భుత ఆరంభం ఇవ్వగా.. లియామ్ అన్సెల్ లియామ్ 27, 37 నిమిషాల్లో పెనాల్టీ గోల్స్ సాధించాడు. 41వ నిమిషంలో డేవిడ్ గుడ్, బందూరక్ నికోలస్ 57వ నిమిషంలో గోల్ చేసి, స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు.



వేల్స్‌తో తలపడుతున్న ఇంగ్లండ్ జట్టు



విజయోత్సాహంలో భారత జట్టు ఆటగాళ్లు

4 జయహో భారత్..

పురుషుల హాకీ ప్రపంచకప్-2023లో భారత్ విజయభేరి మోగించింది. రౌర్కెలా బిర్సాముండా స్టేడియంలో తొలిరోజు స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆరంభం నుంచి ఆధిపత్యాన్ని కొనసాగించడం విశేషం. ప్రేక్షకుల ఆదరణ టీమ్ ఇండియా క్రీడాకారులను విజృంభింప జేసింది. 2-0 స్కోరుతో స్పెయిన్‌ను ఓడించింది. ఒడిశాకు చెందిన అమిత్ రోహిదాస్ తొలి గోల్ చేసి, భారత్ ఆధిపత్యానికి వారధిగా నిలిచాడు. పురుషుల హాకీ ప్రపంచకప్ చరిత్రలో భారత్‌కు ఇది 200వ గోల్ కావడం విశేషం. ఆట 12వ నిమిషంలో దక్కిన పెనాల్టీని వైస్ కెప్టెన్ రోహిదాస్ గోల్‌గా మలచగా, హార్దిక్ సింగ్ 26వ నిమిషంలో మరో గోల్ చేశాడు.

హోరాహోరీగా..

- మాల్యవంత్ మహోత్సవాల్లో రసవత్తరంగా పడవ పోటీలు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో ఆదివారం నుంచి జరుగుతున్న మాల్యవంత్ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం సత్తిగూడ జలాశయంలో పడవ పోటీలు నిర్వహించారు. ఇందులో 40 మంది పోటీదారులు పాల్గొనగా, ఒక్కో పడవలో నలుగురు చొప్పున క్రీడాకారులు ఉన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మల్కన్‌గిరి సబ్ కలెక్టర్ అక్షయ కుమార్ ఖెముండు జెండా ఊపి, ఈ పోటీలను ప్రారంభించారు. ఇందులో ప్రథమ స్థానంలో ఎంవీ-111 గ్రామం నిలవగా, సోరిసమాల, సింద్రిమాల గ్రామాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ... విజేతలకు ఈనెల 15 నుంచి జరగనున్న జిల్లాస్థాయి ఉత్సవాల్లో బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతలో దాగి ఉన్న ప్రతిభ నిరూపించుకునేందుకు ఇటువంటి వేదికలు ఎంతగానో దోహద పడతాయన్నారు. పోటీ సమయంలో అధికారులతో కలిసి బోటులో పర్యటిస్తూ పోటీదారులను ఉత్సాహ పరిచారు. అలాగే ముందస్తు చర్యల్లో భాగంగా ఆపదమిత్ర బృందాలను అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రత్నాకర్ సాహు, మల్కన్‌గిరి అదనపు కలెక్టర్ మహేశ్వర్‌చంద్ర నాయక్, అటవీశాఖ రేంజర్ జగన్నాథ్ ప్రసాద్ బిసోయి, జిల్లా సంక్షేమాధికారి కృపాసింధు బెహరా, డీఐపీఆర్ ప్రమీల మాఝి తదితరులు పాల్గొన్నారు.



ప్రథమ స్థానంలో నిలిచిన ఎంవీ-111 గ్రామస్తులు



పడవల్లో దూసుకొస్తున్న పోటీదారులు



ప్రసంగిస్తున్న సబ్ కలెక్టర్ అక్షయకుమార్ ఖెముండు



అందుబాటులో ఆపదమిత్ర బృందం సభ్యులు

క్లుప్తంగా

ఆటో, బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: జియ్యమ్మవలస మండలం తురకనాయుడువలస గ్రామసమీపంలోని కాలువ వద్ద ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆటో బలంగా ఢీ కొట్టడంతో ఇద్దరు వ్యక్తులు గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. తురకనాయుడువలస గ్రామానికి చెందిన తమరాడ శ్రీనివాసరావుకు, ఇత్తిలి శ్రీనులు శుక్రవారం బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టగా కింద పడిన వారిద్దరి కాళ్లు చేతులకు బలమైన గాయాలయ్యాయి. ఈ మేరకు క్షతగాత్రులను 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పార్వతీపురం ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు.

పదోన్నతులు చేపట్టాలి

విజయనగరం ఫూల్‌బాగ్: ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత పేరుతో ఎటువంటి నియమ నిబంధనలు పాటించకుండా చేస్తున్న పనిసర్దుబాటును తక్షణం రద్దు చేయాలి. గతంలో చేసిన ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా ఫ్యాప్టో కార్యవర్గం డిమాండ్ చేసింది. ఫ్యాప్టో ఆధ్వర్యంలో శుక్రవారం డీఈఓ బి లింగేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు డి శ్యామ్, రమేష్ చంద్రపట్నాయక్, డి ఈశ్వరరావు, పి.శ్రీనివాసరావు, టి సన్యాసిరాజు, బుకారీ బాబు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

- దీఈఓ ఎస్‌డీవీ రమణ

పార్వతీపురం టౌన్: దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమం శనివారం స్థానిక ఆర్‌సీఎం పాఠశాల ప్రాంగణం వద్ద నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్రశిక్ష, ఎస్‌ఐఈపీఐడీ నెల్లూరు వారి సహకారంతో ఉపకరణాల పంపిణీ చేపట్టనున్నట్లు చెప్పారు. మొత్తం 490 ఉపకరణాలను దివ్యాంగులకు అందజేయనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు, కలెక్టర్ నిషాంత్ కుమార్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

డైట్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య

గంట్యాడ: మండలంలోని కరకవలసలో గల ప్రేమ రెసిడెన్సీలో నివాసం ఉంటూ నెల్లిమర్ల డైట్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్న అవనాపు సతీష్ గురువారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం నిమత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి శుక్రవారం తరలించారు. వివాహం జరిగి 18 ఏళ్లయినా పిల్లలు లేక పోవడం, ఆస్తి విషయంలో తగాదాలు ఉండడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు చెప్పారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యా యత్నం



చికిత్సపొందుతున్న సింహాచలం

పార్వతీపురం: జియ్యమ్మవలస మండలం మరువాడ గ్రామానికి చెందిన ఆరిక సింహాచలం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇందుకు సంబంధించి ఆయన మేనమామ బిడ్డిక గౌరన్న దొర ఇచ్చిన సమాచారం మేరకు పార్వతీపురం జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యానికి అలవాటు పడిన సింహాచలం వ్యక్తిగత కారణాలతో మనస్తాపం చెంది పురుగు మందు తాగేసినట్లు భావిస్తున్నామని ఫిర్యాదు దారు పేర్కొన్నాడు, సింహాచలం పురుగు మందు తాగిన విషయం గమనించి 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందజేశారు. ఫిర్యాదు మేరకు ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిమాండ్ ఖైదీ పరారీ



పరారీలో ఉన్న రిమాండ్ ఖైదీ రాంబాబు

రాజాం సిటీ: పాలకొండ సబ్ జైలు రిమాండ్ ఖైదీ పున్నాన రాంబాబు పరారైనట్లు పోలీసు వర్గాలు శుక్రవారం తెలిపాయి.విజయనగరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ కేసుకు సంబంధించి రిమాండ్ ఖైదీని విజయనగరం ఏఆర్ సిబ్బంది ఈ నెల 12న కోర్టుకు తీసుకువెళ్లారు. తిరిగి పాలకొండ సబ్‌జైలుకు అప్పగించేందుకు ఆర్టీసీ బస్సులో తీసుకు వస్తుండగా రాజాం బస్టాండ్ వద్ద ఖైదీ తప్పించుకుని పారిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. ఖైదీకి ఎస్కార్ట్‌గా వచ్చిన విజయనగరం ఏఆర్ హెచ్‌సీ బి.శంకరరావు రాజాం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు టౌన్ సీఐ కె.రవికుమార్ తెలిపారు.

ముగిసిన క్రీడోత్సవం



టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న విలేకర్లు

- చౌయితి టగ్ ఆఫ్ వార్‌లో విజేతగా నిలిచిన జిల్లా యంత్రాంగం
- వాలీబాల్ ట్రోఫీ కైవసం చేసుకున్న మల్లిగాం జట్టు
- ఆనందంతో గంతులేసిన కలెక్టర్ సింగ్



ప్రసంగిస్తున్న కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, వేదికపై ఎస్పీ వివేకానంద శర్మ, అధికారులు

రాయగడ: చౌయితి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8నుంచి కొనసాగిన క్రీడోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన టగ్ ఆఫ్ వార్ పోరులో జిల్లా యంత్రాంగం విజేతగా నిలిచింది. అదేవిధంగా మల్లిగాం జట్టు వాలీబాల్ ట్రోఫీని కైవసం చేసుకుంది. టగ్ ఆఫ్ వార్ పోటీల్లో స్థానిక న్యాయవాదులు, సివిల్ సొసైటీ, పాత్రికేయులు, జిల్లా అధికార యంత్రాంగం పాల్గొనగా.. ముందుగా న్యాయవాదులతో జరిగిన మ్యాచ్‌లో సివిల్ సొసైటీ గెలుపొందింది. అనంతరం పాత్రికేయులతో జరిగిన పోరులో జిల్లా యంత్రాంగం గెలుపు సొంతం చేసుకుంది. అనంతరం హోరాహోరీగా జరిగిన ఫైనల్స్ మ్యాచ్‌లో సివిల్ సొసైటీ జట్టుపై జిల్లా యంత్రాంగం జయకేతనం ఎగుర వేసింది. జిల్లా యంత్రాంగం తరుపున కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఎస్పీ వివేకానంద శర్మ, అదనపు ఎస్పీ రాజ్‌ప్రసాద్, డీఎస్పీ తవుడియా తదితరులు పాల్గొన్నారు. అత్యంత రసవత్తరంగా కొనసాగిన టగ్ ఆఫ్ వార్ పోటీల్లో జిల్లా యంత్రాంగం విజయం సాధించడంతో కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ ఆనందంతో గంతులేశారు.

ఇదే ఉత్సాహం కనబరచాలి..

ఈనెల 18 నుంచి 23వరకు రాయగడ గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్న చౌయితి ఉత్సవాల్లో కూడా ఇదే తరహా జోష్‌తో అంతా విజయవంతమయ్యేలా సహకరించాలని కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ అన్నారు. చౌయితి క్రీడోత్సవాల ముగింపు సందర్భంగా ఆమె ప్రసంగించారు. గెలుపోటములు సహజమని, గెలుపు ఆనందాన్ని ఇస్తుందని, ఓటమి భవిష్యత్‌కు మార్గం చూపిస్తుందని అభిప్రాయం వ్యక్తంచేశారు. ప్రతి క్రీడాకారుడు ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ మాట్లాడుతూ జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో గత 6 రోజులుగా నిర్వహిస్తున్న పోటీల్లో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారని అభినందించారు.

వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండార్లు కూడా పాల్గొని, తమ మద్దతు తెలియజేశారన్నారు. కార్యక్రమంలో న్యాయవాది బ్రజసుందర్ నాయక్, జిల్లా క్రీడాశాఖ అధికారి షేక్ ఆలీనూర్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా రోప్ లాగుతున్న కలెక్టర్, ఎస్పీ, అదనపు ఎస్పీలు



హోరాహోరీగా సాగుతున్న వాలీబాల్ ఫైనల్ పోరు

2024లో బీజేడీని గెలిపిద్దాం



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న మంత్రి జగన్నాథ సరక

- రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి నరక పిలుపు
- బిసంకటక్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం

రాయగడ: రానున్న సార్వత్రిక ఎన్నికలు 2024లో బీజేడీని అఖండ మెజార్టీతో గెలిపిద్దామని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక పిలుపునిచ్చారు. తన సొంత శాసనసభ నియోజకవర్గం జిల్లాలోని బిసంకటక్‌లో గురువారం సాయంత్రం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని కల్యాణ సింగుపూర్, కొలనార, బిసంకటక్, మునిగుడ సమితుల నుంచి వందలాది కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో పాటు దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ ఆశయాలను గౌరవించే ప్రతిఒక్కరూ బీజేడీకి మద్దతివ్వడం ఖాయమని విశ్వాసం వ్యక్తంచేశారు. ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించే సత్తా కేవలం బీజేడీకి మాత్రమే ఉందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలను ఆయా పార్టీలను ఛీత్కరించుకోవడంతోనే గత రెండు దశాబ్దాలకు పైగా రాష్ట్రంలో నవీన్ పట్నాయక్ నాయకత్వంలో బీజేడీ పగ్గాలు చేపడుతోందని తెలిపారు. ప్రజల నమ్మకం, విశ్వాశాలను వమ్ము చేయకుండా వారి కష్ట, సుఖాల్లో అండగా ఉండటంతోనే ఈ ఆదరణ లభిస్తుందని ఆనందం వ్యక్తంచేశారు.

వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలి

రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటి నుంచే ప్రతి కార్యకర్త వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని మంత్రి సరక పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు. గ్రామస్థాయి నుంచి ప్రతి ప్రాంతంలో కార్యకర్తలు తమదైన శైలిలో నిర్విరామంగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని సూచించారు. పంచాయతీ స్థాయిలో పార్టీ సమావేశాలను ఆయా ప్రాంత నాయకులు నిర్వహించి.. కార్యకర్తలకు దిశ, మార్గాలను సూచించే విధంగా ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. ఈదఫా జరగనున్న ఎన్నికలు అత్యంత కీలకమని, అవి పార్టీ ప్రతిష్టకు ముడిపడి ఉంటాయని అభిప్రాయం వ్యక్తంచేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని, ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు.

అండగా ఉంటా...

బిజూ జనతా దళ్‌ను ప్రతి ఎన్నికల్లో ప్రజలు ఎంతో విశ్వాసంతో గెలిపిస్తూ వస్తున్నారని దీనిని నిలబెట్టుకోవడవానికి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్ అన్నారు. అండగా ఉంటాననే భరోసా ప్రతి ఓటరుకు కల్పించాల్సిన బాధ్యత కార్యకర్తలదే అని స్పష్టంచేశారు. పార్టీలో వ్యక్తిగత స్వార్థాలకు తావులేకుండా ప్రతి కార్యకర్త, నాయకుడు శ్రమించాలన్నారు. వ్యూహ, ప్రతి వ్యూహాల మధ్య ప్రతిపక్ష పార్టీలు తమను దెబ్బకొట్టేందుకు విశ్వప్రయత్నం చేస్తాయని, వాటిని పట్టించుకోకుండా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని తెలిపారు. అలాగే గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్ సునా, బిజు జనతాదళ్ యువజన విభాగం జిల్లాశాఖ అధ్యక్షుడు దేవాశీష్ ఖడంగా తదితరులు ప్రసంగించారు.

చిరంజీవి అభిమానుల సందడి



థియేటర్ వద్ద కేక్ కోస్తున్న చిరంజీవి అభిమానులు

పర్లాకిమిడి: పట్టణంలోని కృష్ణా సినీమ్యాక్స్ థియేటర్‌లో టాలీవుడ్ అగ్ర కథానాయుడు మెగ స్టార్ చిరంజీవి చలనచిత్రం వాల్తేర్ వీరయ్య శుక్రవారం విడుదలైంది. సినిమా బెనిఫిట్ షో సందర్భంగా చిరంజీవి అభిమాన సంఘం సభ్యులు కేక్ కోసి, సందడి చేశారు. అలిజింగి రాము, ధర్మా, కృష్ణ, శ్యామ్ ఆధ్వర్యంలో ప్రేక్షకులకు పంచిపెట్టారు.

వరికుప్పలకు నిప్పుపెట్టిన దుండగులు

- రూ.1.5 లక్షల నష్టం

వీరఘట్టం: ఆరుగాలం కష్టపడి రైతు పండించిన వరిచేనును గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేయడంతో ఆ రైతుకు సుమారు రూ.1.50 లక్షల నష్టం జరిగింది. ఈ సంఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయినగర్ కాలనీకి చెందిన రైతు ఆలుబిల్లి మజ్జీశ్వరరావు తాను పండించిన రెండు ఎకరాల్లోని వరి చేనును కర్రల మిల్లు సమీపంలో ఉన్న వైర్ల ఫ్యాక్టరీ ఆవరణలో కుప్పలు పెట్టాడు.

సంక్రాంతి నండగ తర్వాత నూర్పు చేసి ధాన్యం విక్రయించాలనుకున్నాడు. అయితే శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ఆ కుప్పలకు నిప్పు పెట్టడంతో ధాన్యం కుప్పలు అగ్నికి ఆహుతై బూడిద మిగిలింది. సంఘటనా స్థలం వద్ద ప్రమాదాన్ని పరిశీలిస్తే వరిచేను కుప్పలను కావాలనే ఎవరో కాల్చేసినట్లు ఆధారాలు స్పష్టంగా కనిపించాయి.దీంతో గుర్తు తెలియని వ్యక్తులు తన వరిచేను కుప్పలు కాల్చేసినట్టు బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై ఎం.హరికృష్ణ కేసు నమోదు చేశారు. అంతకు ముందు పాలకొండ ఫైర్ సిబ్బందికి ఇక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

తెలంగాణ సీఎంతో గిరిధర్ గొమాంగొ భేటీ



సీఎం కేసీఆర్‌తో గిరిధర్ గొమాంగొ, మిట్టు గొమాంగొ మాటామంతీ

- ఇరువురి మధ్య స్నేహపూర్వక భేటీగానే ప్రకటన

కొరాపుట్: తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు(కేసీఆర్)తో ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగొ భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ఆయనను శుక్రవారం కలుసుకున్నారు. రాష్ట్ర రాజకీయాలలో ఈ విషయం ఆసక్తి కలిగించింది. సోనియాగాంధీ కుటుంబానికి నమ్మకమైన వ్యక్తులలో గిరిధర్ ఒకరు. ప్రస్తుతం బీజేపీలో కొనసాగుతున్న ఆయన.. కొరాపుట్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ తరుపున 9సార్లు ఎంపీగా గెలిచిన ఘనత ఉంది. ఎమర్జెన్సీతో దేశవ్యాప్తంగా ఇందిరాగాంధీపై వ్యతిరేక పవనాలు వీచిన అనంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి అతికొద్ది మంది ఎంపీలుగా గెలవగా, అందులో గిరిధర్ గొమాంగో ఒకరు. 1999లో అనూహ్యంగా కాంగ్రెస్ తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసే అవకాశం దక్కించుకోగా, 10నెలల పాటు ఆ పదవిలో కొనసాగారు. అంతకుముందు యూపీఏ హయాంలో కేంద్రమంత్రిగా కొనసాగారు. ముఖ్యమంత్రి అయిన వెంటనే 1999లో తన ఎంపీ స్థానం నుంచి భార్య హేమా గొమాంగొను కొరాపుట్ ఎంపీగా గెలిపించుకున్నారు. అనంతరం 2004లో మరోసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు.

ఒడిశా రాజకీయాలు.. అప్రస్తుతం

వివిధ కారణాలతో 2015లో కాంగ్రెస్‌ను వీడిన గిరిధర్ గొమాంగొ.. అనూహ్యంగా బీజేపీలో చేరారు. అయితే ఆ పార్టీలో పెద్దగా గుర్తింపు దక్కలేదు. ముఖ్యమంత్రిగా చేసిన తనకు రాజ్యసభ లేదా గవర్నర్ పదవి లభిస్తుందనే ప్రచారం జరిగింది. అయితే ఇప్పటి వరకు అటువంటి అవకాశం దక్కలేదు. ఈ నేపథ్యంలో ఆయన తెలంగాణ సీఎం కేసీఆర్‌ను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. గిరిధర్‌తో పాటు అతని కుమారుడు బీజేపీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్న శిశిర్ గొమాంగొ(మిట్టు) వెంటే ఉన్నారు. ఈ భేటీపై మిట్టు 'సాక్షి' ప్రతినిధితో మాట్లాడారు. కేసీఆర్‌తో తన తండ్రికి 2004 నుంచి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఇది స్నేహపూర్వక భేటీ మాత్రమేనని, జాతీయ రాజకీయలపై కొద్దిసేపు చర్చ జరిగిందన్నారు. ఒడిశా రాజకీయాలపై ప్రస్తావన వచ్చినా.. వాటి వివరాలు ప్రస్తుతం వెల్లడించలేనన్నారు. పగలు ఒక పార్టీ, రాత్రి ఇంకో పార్టీ తమకు చేతకాదని పేర్కొన్నారు. బహిరంగ రాజకీయాలు తమ పద్ధతని, అందుకే బహిరంగంగానే కేసీఆర్‌ను కలిసామని ప్రకటించారు.

'మా గ్రామాన్ని దశమంత్‌పూర్ సమితిలో కలపండి'



గంబారిగుడ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీ సప్తగిరి ఉల్క

కొరాపుట్: తమ గ్రామాన్ని దశమంత్‌పూర్ సమితిలో కలపాలని గంబారిగుడ వాసులు కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కను కోరారు. జిల్లా దశమంత్‌పూర్ సమితిలో ఎంపీ గురువారం పర్యటించారు. మార్గం మధ్యలోని గుంబారిగుడను సందర్శించారు. ఈ గ్రామం రెవెన్యూ పరంగా రాయగడ జిల్లా కాశీపూర్ సమితిలో ఉంది. భౌగోళికంగా సమితి కేంద్రానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. అయితే కొరాపుట్ జిల్లా దశమంతపూర్ సమితి కేంద్రం నుంచి కేవలం 3 కిలోమీటర్ల దూరంలో కాగా, బ్రిటిష్ చట్టాల ప్రకారం ఈ తప్పిదం జరిగింది. దీంతో గిరిజనులు ఏ ప్రభుత్వ కార్యానికైనా సుదూరంలోని కాశీపూర్ వెళ్లాల్సి వస్తోంది. పక్క గ్రామాల ప్రజలు దశమంతపూర్ లోనే తమ పనులు చక్కబెట్టుకుంటున్నారు. ఈ సమస్యపై దశాబ్దాలుగా గిరిజనులు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకపోయింది. తాజాగా తన పర్యటన నేపథ్యంలో సమస్య తెలుసుకున్న ఎంపీ.. పరిష్కారానికి తనవంతు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీనిపై పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తానని భరోసా ఇచ్చారు.

విద్యుత్ స్తంభం పైనుంచి జారి పడి యువకుడి మృతి

కొత్తవలస: మండలంలోని మోడల్ స్కూల్ సమీపంలో గల ప్రైవేట్ లేఅవుట్‌లో విద్యుత్ స్తంభం నుంచి జారి పడి విశాఖ జిల్లా.పద్మనాభం మండలం విజయరామపురం గ్రామానికి చెందిన కండుబోయిన ఎర్నిబాబు(24)శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మోడల్ స్కూల్ సమీపంలో గల లేవుట్‌లో విద్యుత్ లైన్ వేస్తున్నారు. ఈ పనిలో భాగంగా ఎర్నిబాబు స్తంభం ఎక్కి జారి పడడంతో నుదుటికి బలమైన గాయం తగిలి తీవ్రంగా రక్తస్రావం జరిగింది. తోటి కార్మికులు హుటాహుటిన స్థానిక పీహెచ్‌సీకి ఆటోలో తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి తల్లిదండ్రులు అమ్మతల్లి, అప్పలసూరి ఉన్నారు. ఆ దంపతులకు ఏకైక కుమారుడు కావడంతో కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కుమారుడి మరణంతో ఆ వృద్ధ తల్లిదండ్రుల రోదన అందరినీ కంట తడి పెట్టించింది. మృతుడు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలసూర్యారావు తెలిపారు.

పండగకు ఊరెళ్తున్నారా..!

- పోలీసులకు సమాచారం తప్పనిసరి
- ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి
- నిరంతర పోలీస్ పర్యవేక్షణతో ఇంటికి పూర్తిస్థాయి భద్రత

LHMS AP Police

ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ యాప్

విజయనగరం క్రైమ్: సంక్రాంతి పండగకు ఊరెళ్తున్న వారందరికీ పోలీస్ వారి విజ్ఞప్తి. సొంతూళ్లకు, అత్తవారిళ్లకు వెళ్లే వారంతా తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిందేనని సూచిస్తున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా దొంగలు ఇల్లు గుల్ల చేసే ఆస్కారం ఉన్నందున ప్రతి ఒక్కరూ స్వీయజాగ్రత్తలతో పాటు కనీస సమాచారాన్ని సమీప పోలీస్‌స్టేషన్‌లో అందించాలని హితవు చెబుతున్నారు. నాలుగైదు రోజుల పాటు ఇళ్లను వదిలి వెళ్లే వారంతా తప్పనిసరిగా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇందుకోసం జిల్లా పోలీసు యంత్రాంగం అడుగడుగునా మైక్‌ల ద్వారా కాలనీల్లోనూ, బహిరంగ ప్రదేశాల్లో అనౌన్స్ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తోంది.

ఇంట్లో విలువైన వస్తువులు ఏమైనా ఉంటే సమీప బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం తప్పనిసరి. ఇటీవల తాళాలు వేసిన ఇళ్లతో పాటు మనుషులు ఉన్న ఇళ్లల్లోనూ దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇక శివారు ప్రాంతాలైతే అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిందే. ఇంటికి తాళాలు వేస్తే ఆండ్రాయిడ్ మొబైల్‌లో పోలీసులు రూపొందించిన ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేసుకుని సమాచారమందించండి. పోలీసులు మీ ఇంటికి భద్రత కల్పిస్తారు. ఊర్లో ఉన్న బంధువులకు కూడా సమాచారమివ్వాలని చెబుతున్నారు.

యాప్ పనితీరు ఇలా

ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ (లాక్డ్ హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ఒక ఆండ్రాయిడ్ యాప్. దీని ద్వారా ఇంటికి రక్షణగా పోలీస్ సహాయం సులభంగా తీసుకోవచ్చు. చిన్న మెసెజ్ పెట్టడం వల్ల మీరు ఇంట్లో లేనప్పుడు మీ ఇంటిని సురక్షితంగా చూసే బాధ్యతను పోలీసులు తీసుకుంటారు. ఈ యాప్‌పై అవగాహన లేకపోవడం వల్ల ప్రజలు పెద్దగా స్పందించడం లేదు. వన్‌టౌన్ పరిధిలో 16, టూటౌన్ పరిధిలో 14, నెల్లిమర్ల మూడు, బొబ్బిలి 10, సాలూరు 5, పార్వతీపురం పరిధిలో 10 మొత్తం 58 సీసీ కెమెరాలను ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ కోసం ప్రత్యేకంగా సిద్ధంగా ఉంచారు. ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ యాప్‌లో ఇప్పటివరకూ జిల్లాలో సుమారు 14 వేల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇప్పటివరకూ 450 మంది వారు ఇళ్లల్లో లేని సమయాల్లో యాప్‌ను సద్వినియోగం చేసుకుని ఇళ్లకు భద్రత పెంచుకున్నారు. యాప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా పట్టువదలని విక్రమార్కుల్లా పోలీసులు ప్రయత్నిస్తూనే ఉన్నారు.

మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయడం ఇలా..

స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ ఏపీ పోలీస్ అని టైప్ చేయాలి. ఏపీ పోలీస్ పేరిట అప్లికేషన్ కనిపిస్తుంది. దీన్ని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. తర్వాత వ్యక్తిపేరు, ఫోన్ నంబర్, చిరునామాతో పాటు ఇంట్లో కూర్చుని గూగుల్ మ్యాప్‌ను అటాచ్ చేయాలి. వెంటనే మనమిచ్చిన ఫోన్ నంబర్‌కు వన్‌టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. దాన్ని యాప్‌లో టైప్ చేస్తే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత మన ఫోన్‌కు రిజిస్ట్రేషన్ నంబర్ వస్తుంది. దీన్ని ఎక్కడైనా భద్రపరుచుకోవాలి. ఇక ఎప్పుడైనా, ఎక్కడికైనా ఊరికి వెళ్తున్నప్పుడు పోలీసులు ఇంటిపై నిఘా ఉంచాలనుకుంటే యాప్‌లోకి వెళ్లి 'రిక్వెస్ట్ పోలీసు వాచ్' ఆప్షన్ ఎంచుకోవాలి. అలా చేసిన తర్వాత యూజర్ ఐడీ అడుగుతుంది. గతంలో సెల్‌ఫోన్‌కి వచ్చిన రిజిస్ట్రేషన్ సంఖ్యను టైప్ చేయాలి. మనం ఎప్పుడు ఊరికి వెళ్తున్నాం. సమయం, తిరిగి వచ్చే తేదీ, సమయం టైప్ చేసి సబ్ మిట్ చేసి వాచ్ రిక్వెస్ట్‌పై క్లిక్ చేయాలి.


పనితీరు ఇలా..

సబ్‌మిట్ వాచ్ రిక్వెస్ట్ పూర్తయిన తర్వాత ఇంటికి పోలీస్ కానిస్టేబుల్ వస్తారు. ఇంట్లో ఆలౌట్ మిషన్‌ను పోలి ఉండే ఓ మోషన్ కెమెరాను బిగించిన తర్వాత మనం ఇంటికి తాళం వేసుకుని వెళ్లిపోవచ్చు. అప్పటి వరకూ కెమెరా పనిచేయదు. ఎప్పుడైతే దొంగలోనికి ప్రవేశిస్తాడో ఆ కదలికల ద్వారా కెమెరా ఆన్ అవుతుంది. ఒక్కసారి కెమెరా ఆన్‌కాగానే జిల్లా ఎస్పీకి, కమాండ్ కంట్రోల్ గదిలో అనుసంధానం చేసిన టీవీలోకి లైవ్ ప్రత్యక్ష్యమవుతుంది. అలారం ద్వారా బ్లూకోట్ పోలీసుల నుంచి ఎస్పీ వరకూ అలెర్ట్ చేస్తుంది. ఇక నేరుగా పోలీసులు వచ్చి దొంగను పట్టుకెళ్తారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

ఊరికి వెళ్తున్న సమయంలో సమీప పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా సమాచారం అందించాలి. రాత్రి గస్తీ నిర్వహించే పోలీసులు మీరిచ్చే రిపోర్ట్ ఆధారంగా తప్పనిసరిగా అటువైపు వెళ్లి పరిశీలిస్తుంటారు.

ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ ద్వారా ప్రత్యక్ష పర్యవేక్షణ



పోలీస్ కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానమై ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్ యాప్ పనిచేస్తుంది. పండగకి ఊర్లె వారంతా ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి. సీసీ కెమెరాలతో పాటూ ప్రత్యేక బందోబస్తు పర్యవేక్షిస్తుంటుంది. విలువైన వస్తువులను ఇంటిలో ఉంచుకోవద్దు. అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పండగకు దూరప్రాంతాలకు వెళ్లే ప్రజలు సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారమివ్వాలి. ప్రత్యేక బృందాలు ఆయా ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తారు. –ఎం.దీపిక, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, విజయనగరం

క్లుప్తంగా

గోదాదేవికి తులసీ దళార్చన


గోదాదేవికి తులసీ దళాలతో అలంకరించిన దృశ్యం

సారవకోట: మండలంలోని చీడిపూడి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం గోదాదేవికి తులసీదళాలతో అర్చన చేశారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వెంకటేశ్వర స్వామిని శ్రీకృష్ణుడిగా అలంకరించి ప్రత్యేక విశేష పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న గోదాదేవి విగ్రహానికి తులసీదళాలతో అర్చన చేసినట్లు అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు.

సంక్రాంతికి ఆదిత్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

అరసవల్లి: సంక్రాంతి పెద్ద పండుగ సందర్భంగా వరుస నాలుగు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించేలా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం శనివారం ఉదయం భోగి సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించి, ప్రత్యేక ప్రసాదాలను స్వామికి నివేదించనున్నారు. అలాగే ఆదివారం మకర సంక్రాంతి సందర్భంగా మకర సంక్రమణ పంచామృతాభిషేకాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదిత్యుని మూలవిరాట్టుకు వేకువజామున క్షీరాభిషేకం జరుపనున్నారు. ఈ క్రమంలో నిజరూప దర్శనానికి కూడా అవకాశం ఉండడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఈ సేవలో పాల్గొననున్నారు. అలాగే కనుమ నాడు పెద్ద సంఖ్యలో రైతులు తమ పంట ఫలాలను స్వామికి నివేదించనున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రానికి ఆలయంలో భక్తుల దర్శనాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధానార్చకులు శంకరశర్మ, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ఏర్పాట్లు పరిశీలించారు.

'తాత్కాలిక సర్దుబాటు రద్దు చేయాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ కోర్టులో ఉందన్న నెపంతో సర్వీస్ నిబంధనలు లేకుండా, గతంలో ఇచ్చిన పదోన్నతులు చేపట్టకుండా, ప్రభుత్వం చేపట్టిన తాత్కాలిక పని సర్దుబాటును వెంటనే రద్దు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫ్యాప్టో సభ్య సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఫ్యాప్టో చైర్మన్ మజ్జి మదన్మోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలను తుంగలో తొక్కి ప్రమోషన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ ఉపాధ్యాయులను తాత్కాలికంగా ప్రమోషన్ పోస్టులో పనిచేయమని ఆదేశాలు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని అన్నారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ కొమ్ము అప్పలరాజు మాట్లాడుతూ తాత్కాలిక సర్దుబాట్ల ద్వారా రూ.2500 చెల్లిస్తూ ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ ఇవ్వకుండా పనిచేయించుకోవడం వెట్టిచాకిరీ కిందకే వస్తుందని అన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధవళ సరస్వతి మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలతో గానీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతో కానీ మాట్లాడకుండా ఉత్తర్వులు విడుదల చేయడం సమంజసం కాదన్నారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ జీఓ నంబర్ 117 అసంబద్ధాలతో కూడి ఉందని ఆరోపించారు.

ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా రక్తనిధి కేంద్రంలో మూడునెలల ల్యాబ్ టెక్నీషియన్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చైర్మన్ పి.జగన్మోహనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎంఎల్‌టీ ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో స్టైఫండ్, సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం పక్కన ఉన్న రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ఈ నెల 25లోగా దరఖాస్తులు అందజేయాలని, మరిన్ని వివరాలకు 08942-226555, 92471 37111 నంబర్లను సంప్రదించాలని కోరారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


కాధ నందేశ్వరరావు(ఫైల్)

బూర్జ: మండలంలో తుడ్డలి గ్రామానికి చెందిన కాధ నందేశ్వరరావు అలియాస్ వెంకన్న (45) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గురువారం ద్విచక్ర వాహనంపై వ్యక్తిగత పనుల నిమిత్తం ఆమదాలవలస వైపు నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఎదురుగా పాలకొండ వైపు నుంచి వస్తున్న లారీ ట్రాక్టర్‌ను తప్పించబోయి వెంకన్నను ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108లో రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రైవేటుకు ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఈయన పాలకొండ యూనియన్ బ్యాంకులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నారు. భార్య సత్యవతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంబరాల కళయిక

వీధి మధ్య భోగి మంటలో వేడి తగ్గకుండానే 'అయ్య గారికి దండం పెట్టు అంటూ..' గంగిరెద్దుల వారి ఆటాపాటా. కొత్తల్లుళ్లు, ఇంటి ఆడపడుచులతో ముచ్చట్లు సాగుతున్న వేళ.. 'శ్రీమన్నారాయణ..' అంటూ తప్పెటగుళ్ల దరువులు. ఇంటి పెరట అమ్మలు, అమ్మమ్మలు పిండి వంట పనుల్లో ఉంటే ముంగిట మురిపించే గిరిజనుల థింసా నాట్యాలు. కొత్త బట్టలేసుకుని పిల్లలు అరుగు మీదకు వస్తే కనిపించే నెయ్యి గుర్రం నృత్యాలు. ఒకటా రెండా.. సంక్రాంతి రోజులంటేనే పల్లె విశ్వరూప విన్యాసం చేసేది. ఈ కళలన్నీ ఇప్పుడు జ్ఞాపకాలుగా మారిపోతున్నాయి. ఓ తరానికి తీయని అనుభూతులు పంచిన ఈ జానపద రీతులు ఇప్పటి బాలలకు తెలియకుండా పోతున్నాయి. ఓ రకంగా ఇది 'కళ'వరం కలిగించే అంశమే. సంక్రాంతి వేళ మనవైన కళలను ఓ సారి కంటి ముందుకు తెచ్చుకుందాం.


గంగిరెద్దు విన్యాసం


నెయ్యిగుర్రం నృత్య ప్రదర్శన చేస్తున్న గిరిజనులు

చల్ చల్ గుర్రం..

సారవకోట: గుర్తుందా ఆ గుర్రం.. ఊరూఊరంతా సంక్రాంతి సంబరాల్లో ఉంటే వీధి మధ్యకు వచ్చే నెయ్యి గుర్రం ఒక తరానికి తీపి జ్ఞాపకం. మండలంలోని గిరిజన గ్రామాలైన బురుజువాడ, జగన్నాథపురం, రైవాడ, కోనవానిపేట, పురుషోత్తుకర్ర, సోమయ్యపేట తదితర గ్రామాల్లోని గిరిజనులు సంక్రాంతి నాలుగు రోజుల పాటు ఊళ్లలో ఈ నెయ్యి గుర్రంతో నృత్య ప్రదర్శనలు చేస్తుంటారు. వెదురు కర్రతో గుర్రం ఆకారాన్ని తయారు చేసి దాని చుట్టూ చీరతో కప్పుతారు. ఆ గుర్రంతో పాటు దెయ్యం ముఖం పెట్టుకున్న వ్యక్తి చేసే నృత్యం, రెండు పిన్నలకర్రలు, మద్దెల, తుడుము, లిడక వాయిద్యాలను వాయించే తీరు సిక్కోలు వాసులకు చాలా ప్రత్యేకం. దురదృష్టవశాత్తు ఈ తరానికి ఇలాంటి ఆనందాలు లేకుండా పోతున్నాయి. సంక్రాంతి రోజుల్లో ఈ నెయ్యిగుర్రం ప్రదర్శన చేసి సేకరించిన సొమ్ముతో గిరిజన సంప్రదాయ పద్ధతిలో కొండ దేవతలను పూజించడం, గ్రామాభివృద్ధికి కొంత వినియోగిస్తారు.

సంప్రదాయాన్ని కొనసాగించేందుకు చర్యలు



గిరిజన ఆచార, సంప్రదాయాన్ని కొనసాగించేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. నెయ్యి గుర్రం సారవకోట మండలంలోని చాలా గిరిజన గ్రామాల్లో పురాతనం నుంచి వస్తున్న ఆచారం. సంక్రాంతి నాలుగు రోజుల పాటు గ్రామాల్లో ప్రదర్శనలు ఇచ్చి విరాళాలు సేకరిస్తూ ఉంటాం. ఇప్పటి యువత ఈ నృత్య ప్రదర్శనకు ఆసక్తి కనబర్చడం లేదు.

– కొత్తూరు బోడేన్న, గిరిజన ఐక్యవేదిక మండలాధ్యక్షుడు, సారవకోట మండలం

బసవా.. ఇటు రావా

మందస: కొత్త అల్లుడు వచ్చినా రాకున్నా.. కొత్త బట్టలు వేసుకున్నా వేసుకోకపోయినా.. రంగవల్లులు పెట్టినా పెట్టకపోయినా.. బసవడు రాకుంటే మాత్రం పెద్ద పండగ రాదు. సిక్కోలు జానపద సంపదలో గంగిరెద్దుల వారికి ప్రత్యేక స్థానం ఉంటుంది. తరాల కిందట విశాఖలోని సింహాచలం నుంచి జిల్లా వరకు వచ్చి మందస సమీపంలోని భైరిసారంగపురం వద్ద స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న గంగిరెద్దుల వారు సంక్రాంతికి బసవన్నలను ఆడిస్తూ ఈ ఆటపాటలను ముందు తరాలకు అందిస్తున్నారు. ఉత్తరాంధ్రలోని గ్రామాల్లో భక్తులు సింహాద్రి అప్పన్నను మొక్కుకుని తమ పశువుల శాలలో పుట్టిన దూడలను కానీ కొనుగోలు చేసి కానీ వీరికి అందజేస్తారు. వీటిని బాగా మచ్చిక చేసుకుని, ఎంతో శ్రమించి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. తాము చెప్పినట్లు చేసేలా చేయిస్తారు. తౌడు, ఉలవలు, నువ్వులు, తెలకపిండి, పెసర, మినుము పొట్టు తదితర వాటితో దాణా ఇచ్చి, ముందుగా ఒక ఏడాది పాటు ప్రతి రోజూ శిక్షణ ఇస్తారు. వీటినే సంక్రాంతి రోజుల్లో వీధుల్లో తిప్పుతారు. గ్రామీణులు ఇచ్చే కానుకలతో ఏడాదంతా గడుపుతారు. ఒకప్పటిలా ఇప్పుడు అంత ఆదాయం లేదు. అయినా ఈ కళను వీరు వదలడం లేదు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన కళను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.


డూడూ బసవన్న అంటూ ఇళ్ల వద్ద సందడి చేస్తున్న గంగిరెద్దు కులస్తులు

ఆదరణ తగ్గుతోంది



గంగిరెద్దుల కళకు ఆదరణ తగ్గుతోంది. ఎద్దులకు ఆరు నెలలు శిక్షణ ఇచ్చి.. ఆరు నెలలు ముఠాకు వెళ్తాం. అప్పట్లో 120 కుటుంబాల వారం ఈ పనిచేసే వాళ్లం. ఇప్పుడు 30 కుటుంబాల వారే ఈ కళను కొనసాగిస్తున్నారు. సంక్రాంతికి ఒడిశా వాసులు గంగిరెద్దుల నృత్యాలకు ఎక్కువగా ఆదరిస్తారు. అంతేకాదు.. కళాకారులను గౌరవించి, భత్యాన్ని కూడా ఎక్కువగా ఇస్తారు.

– బాద సూరన్న, జానపద కళాకారుడు, భైరిసారంగపురం

దరువు పడాల్సిందే..

మెళియాపుట్టి: ఉచ్ఛ్వాస నిశ్వాసలు మిళితమైన గానం.. గుండె లయ కలిసిపోయిన తాళం కలగలిపి తప్పెటగుళ్లు. సిక్కోలు తప్పెటగుళ్లకు పుట్టినిల్లు వంటిది. అందులోనూ మెళియాపుట్టి మండలంలో యాదవులు ఈ కళకు తరతరాలుగా కాపలా కాస్తున్నారు. మండలంలోని, కరజాడ, మర్రిపాడు-సి, చీపురుపల్లి, జలకలింగుపురం తదితర గ్రామాల్లో తప్పెటగుళ్ల ప్రదర్శించే బృందాలు ఉన్నాయి. రేకుతో తయారు చేసిన ఓ డప్పు వంటి వాయిద్యాన్ని గుండెకు కటకట్టుకుని చేసే విన్యాసాలు చూసి తీరాల్సిందే. సంక్రాంతి రోజుల్లో ఇది వరకు ఊరూరా తప్పెటగుళ్ల వినిపించేవి. కానీ ఇప్పుడు ప్రత్యేక కార్యక్రమాల్లో తప్ప వీరి విన్యాసాలు కనిపించడం లేదు. కరజాడ గ్రామానికి చెందిన జగన్, లోకనాథం, మర్రిపాడు-సి గ్రామానికి కృష్ణమూర్తిలకు చెందిన బృందాలు పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో ఏటా ప్రదర్శనలు ఇస్తుంటారు.

17 ఏళ్లుగా ఆడుతున్నా..



నేను 17 ఏళ్లుగా 15 మంది బృందంతో తప్పెటగుళ్ల ప్రదర్శనలు ఇస్తున్నాను. సాంస్కృతిక కార్యక్రమాలు, సంక్రాంతి సంబరాల్లో ఆ బృందం ఆడుతుంది. ప్రభుత్వాలు మమ్మల్ని గుర్తించాలి.

– తలగాన కృష్ణారావు, తప్పెటగుళ్ల బృందం గురువు, మర్రిపాడు-సి గ్రామం


జార్ఖండ్ జాతరలో ప్రదర్శన ఇస్తున్న కరజాడ బృందం(ఫైల్)

భోగి పండగకు ఆ రెండు గ్రామాలు దూరం

భామిని: సంక్రాంతి అనగానే ముందుగా వచ్చే భోగి పండగకు విశేష ప్రాధాన్యం. ఊరి చివర కలప దుంగలు, పాత వస్తువులతో వేసే భోగి మంటలకు పిల్లలు తెచ్చే భోగి పిడకల దండలు తోడు కావడంతో రోజంతా భోగి మంట కొనసాగుతుంది. తలంటి స్నానాలు, కొత్త బట్టలు ధరించి భోగి పిడకల దండలను మంటలలో వేయడంలో పిల్లల సందడి చెప్పనలవికానిది. కానీ భామిని మండలంలోని రెండు గ్రామాలు భోగి పండక్కి దూరంగా ఉంటాయి. సింగిడి(ఎస్), గురండి(ఎస్) గ్రామాల్లో దశాబ్దాలుగా భోగి మంటలను వేయడం లేదు. అది ఆయా గ్రామాల వారి ఆచారంగా కొనసాగుతోంది. పర్లాకిమిడి, జయపూర్ జమిందార్ల శాసనం గ్రామాలుగా గుర్తింపు పొందిన, బ్రాహ్మణులకు కేటాయింపు గ్రామాలుగా ఉన్న సింగిడి, గురండి గ్రామాల్లో భోగి మంటలు ఎప్పుడూ వేయరు. ఇదే ఆచారాన్ని ప్రస్తుత తరం వారు కూడా కొనసాగిస్తున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట కూడలి కింతలి మిల్లు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యతిరాజుల రామారావు గాయపడ్డారు. కేశవరావుపేటకు చెందిన ఈయన సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా, శ్రీకాకుళం వైపు వస్తున్న బైక్ ఢీకొట్టింది. వెంటనే క్షతగాత్రున్ని 108 వాహనంలో సింహద్వారం సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు.

కొనుగోలు లక్ష్యాలు పూర్తి చేయాలి

భామిని: మండలంలోని ధాన్యం కొనుగోలు లక్ష్యాలను ఆర్‌బీకేల ద్వారా చేపట్టాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తోట సింహాచలం, తహసీల్దార్ నీలాపు అప్పారావు అన్నారు. భామిని రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి కె.సింహచలం అధ్యక్షతన శుక్రవారం జరిగిన వ్యవసాయ సలహా సంఘ సమావేశంలో మాట్లాడారు. మండలంలో ధాన్యం సేకరణకు 16,800 మెట్రిక్ టన్నుల లక్ష్యం కాగా ఇప్పటికే 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు ఎంఏఓ వివరించారు. మిగతా ధాన్యం సేకరణకు 3వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ఉన్నతాధికారుల అనుమతి సాధించాలని సభ్యులు కోరారు. వీఆర్‌ఓల సహాయంతో ధాన్యం కొనుగోలు చేపట్టాలన్నారు. వ్యవసాయ సహాయకులు, రైతు సంఘ సభ్యులున్నారు.

హుండీలో నగదు చోరీ

మెళియాపుట్టి : మండలంలోని మర్రిపాడు పంచాయతీ జలక లింగుపురంలో అభయాంజనేయ ఆలయం వద్ద హుండీలోని నగదు అపహరణకు గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం వేకువ జామున చెరువుకు స్నానానికి వెళ్లిన కొంతమంది హుండీ తెరిచి ఉండటాన్ని గుర్తించారు. మెళియాపుట్టి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అపూర్వ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కవిటి: మండలంలోని బొరివంక జెడ్పీహెచ్ స్కూల్‌లో 2004-05 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా అప్పటి ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. నాటి అనుభవాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కందిపప్పు నాణ్యతపై ఆరా


కందిపప్పును పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలోని దండివీధిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పౌర సరఫరాల అధికారి డి.వెంకట రమణ, ఐసీడీఎస్ పథక సంచాలకులు కె.అనంతలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పౌర సరఫరాల సంస్థ ద్వారా సరఫరా చేసిన కందిపప్పును పరిశీలించారు. నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, సివిల్ సప్లయ్ సిబ్బంది పాల్గొన్నారు.

కొలిక్కి వచ్చిన సమస్య

- చొరవ తీసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు
- మిల్లర్లు, కూలీల మధ్య ఫలించిన చర్చలు


తహసీల్దార్ పాపారావుకు ఒప్పంద పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

మందస: మండలంలో మిల్లర్లు, కూలీల మధ్య వేతన ఒప్పందంలో నెలకొన్న సమస్య కొలిక్కి వచ్చింది. ఈ సమస్య వలన రైతుల ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోవడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు చొరవ తీసుకొని సీఐటీయూ నాయకులు, కార్మికులు, తహసీల్దార్ బడే పాపారావు, సర్పంచ్‌లతో శుక్రవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కళాసీలు, మిల్లర్లు మెట్టు దిగకపోతే రైతులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. రైస్‌మిల్లుల మూతతో మిల్లర్లకు ఆదాయం ఉండదని, అదేవిధంగా కార్మికుల ఉపాధి లేకుండా పోతుందని చెప్పారు. వేతన ఒప్పందం ప్రకారం 17శాతం పెంచుటకు ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో నిర్ణయానికి వచ్చారు. ఒప్పంద కాలపరిమితి రెండు సంవత్సరాల పాటు ఉంటుందని అంగీకరించారు. కార్మికులకు చెల్లించాల్సిన ఎరియర్స్ కూడా ఏప్రిల్‌లో చెల్లించడానికి యజమానులు అంగీకరించారు. దీంతో మిల్లులు తెరుచుకోవడానికి సిద్ధమవుతున్నాయి. కళ్లాలు, పొలాల్లో ఉన్న ధాన్యాన్ని రైతులు రైతు భరోసా కేంద్రాలకు ఇవ్వడానికి మార్గం సుగమం అయ్యింది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, పితాతొళి, మూలిపొడు, మందస, వీజీపురం, కుంటికోట, బీఎస్‌పురం సర్పంచ్‌లు చింతాడ గణపతి, గుసిరి వెంకటరావు, చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, దుంపల వైకుంఠరావు, దుంపల వైకుంఠరావు, రట్టి లింగయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శిస్టు బాపూజీ, సేనాపతి ఈశ్వరరావు, మిల్లు యజమానులు, సీఐటీయు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పేదలందరికీ సొంత గూడు


లాటరీ విధానంలో లబ్ధిదారుల స్థలాలను ఎంపిక చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు పథకాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా ఇల్లు లేని పేదవారెవరు ఉండరాదనే సంకల్పంతో అందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు మంజూరు చేసి వారి సొంతింటి కలను సాకారం చేస్తోందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పార్వతీపురం పురపాలక సంఘంలో ఇప్పటికే సుమారు 3,100 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు గతంలో మంజూరు చేశారు. అయితే అందులో కొంతమంది ప్లాట్ల రీసైజింగ్‌లో స్థలాలు కోల్పోయారు. ఇటీవల మొత్తం 14 సచివాలయాల పరిధిలో గల 28 వార్డులలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇళ్లకోసం కొంతమంది అర్జీ పెట్టుకున్నారు. వారందరికీ పురపాలక సంఘంలో శుక్రవారం నిర్వహించిన లాటరీ పద్ధతిలో ఇళ్ల స్థలాల పంపిణీ చేపట్టారు. ఈ లాటరీ పద్ధతిలో లబ్ధిదారులు ఎవరి చీటీ వారే తీసుకోగా అందులో వచ్చిన నంబర్ స్థలాన్ని వారికి కేటాయించారు. ఈ లబ్ధిదారులందరికీ వెంకంపేట రెవెన్యూ పరిధిలో ఉన్న జగనన్న లేఔట్‌లో స్థలాలు కేటాయించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ అందరి జీవిత కాల ఆశయాన్ని నెరవేర్చిన ప్రభుత్వం మనదని, ఇళ్ల స్థలాలు వచ్చిన ప్రతి ఒక్కరూ తప్పక ఇంటి నిర్మాణం సకాలంలో మొదలు పెట్టి పూర్తి చేసుకుని ప్రభుత్వ ఆశయం పూర్తిస్థాయిలో నెరవేరేలా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్ పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్‌చైర్మన్ ఇందుపూరు గున్నేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు, తహసీల్దార్ శివన్నారాయణ, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు, స్టేట్ డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, లబ్ధిదారులు, మున్సిపల్ సచివాలయాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పందాలు వద్దు.. సంప్రదాయ క్రీడలే ముద్దు

- ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ


ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: సంక్రాంతి పండగ నేపథ్యంలో కోడి, గొర్రె పందాలు వద్దని సంప్రదాయ క్రీడలే ముద్దని ఎల్విన్‌పేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో తెలుగుదనం ఉట్టిపడేలా గ్రామాల్లోని యువతీ యువకులు రంగవల్లులు, కబడ్డీ, వాలీబాల్ వంటి క్రీడా పోటీలు నిర్వహించుకోవాలే తప్ప పేకాట, కోడి, గొర్రె పందాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్కిల్ పరిధిలోని ఎల్విన్‌పేట, నీలకంఠాపురం, కురుపాం పోలీస్‌స్టేషన్ల పరిధిలో తమ సిబ్బందితో గట్టి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, కోడి, గొర్రె పందాలు, పేకాట నిర్వహించకూడదని గ్రామాల్లో తమ సిబ్బందిచే సూచనలు జారీ చేయడం జరిగిందన్నారు. ఏ గ్రామ పరిధిలోనైనా ఇటువంటి పందాలకు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. పండగ సరదాల పేరుతో వాహనాలను పరిమితికి మించిన వేగంతో నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని, పట్టుబడితే చర్యలు కఠినతరంగా ఉంటాయని సీఐ హెచ్చరించారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం


ఉల్లిబద్రలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

గరుగుబిల్లి: పరిసరాలను పరిశుభ్రతతో అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో ఎర్రన్నగుడి జంక్షన్‌లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. లేకుంటే అవి దోమలకు ఆవాసాలుగా మారి వివిధ రకాల జ్వరాలకు కారణమవుతాయని, ఉపయోగంలో లేని రుబ్బురోల్లు, కొబ్బరిటెంకలు, పాడైన ప్లాస్టిక్ వస్తువులు, సీసాలు, టైర్లు మొదలగు వాటిలో నిల్వ నీటిని లేకుండా జాగ్రత్త పడాలన్నారు. వాటిని ఇంటి ఆవాసాలలో లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి షాపు వద్ద విధిగా చెత్త బుట్టలు ఉంచాలని, పరిసరాల్లో చెత్త వేయకుండా చూసుకోవాలని షాపు యజమానులకు సూచించారు. అనంతరం వైద్య సిబ్బంది నిర్వహించిన ఫ్రై డే – డ్రై డే ర్యాలీలో పాల్గొన్నారు.

అమ్మా ఎందుకు వదిలేశావ్..?

- ఆడ పసికందును వదిలిపెట్టి వెళ్లిపోయిన కర్కశులు
- రోదన విని గుర్తించిన స్థానికులు
- ఆస్పత్రిలో చేర్పించిన పోలీసులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆడ పసికందు

రణస్థలం:

రాత్రి 8 గంటల సమయం. చుట్టూ చిమ్మ చీకటి. మెల్లగా ముసురుకుంటున్న చలిగాలులు. నిశ్శబ్దమైన వాతావరణంలో వినిపించిన ఓ పసికందు రోదన కోష్ట గ్రామాన్ని ఉలిక్కిపడేలా చేసింది. తొమ్మిది నెలలు అమ్మ కడుపులో భద్రంగా ఉన్న బిడ్డ ఆ పేగు తెంచుకున్నాక.. బంధాలకు కూడా దూరమై ఇలా చీకటిలో నిస్సహాయంగా స్థానికుల కంట పడింది. జేఆర్‌పురం ఎస్ఐ జి.రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. కోష్ట గ్రామంలోని పైడి శ్రీనివాసరావు ఇంటి సమీపంలోని కర్రల మోపుపై ఎవరో ఒక ఆడ పసికందును విడిచిపెట్టి వెళ్లిపోయారు. స్థానికులు పసిపాప ఏడుపులు విని పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ రాజేష్ పాపను రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ బిడ్డను ఎవరు ఇక్కడ వదిలి వెళ్లిపోయారో తెలియాల్సి ఉంది.

పసికందు 1.5 కిలోల బరువు ఉందని, జన్మించి ఒక రోజు అయి ఉంటుందని భావిస్తున్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేష్ తెలిపారు.